నమస్తే తెలంగాణ

రాజన్న సిరిసిల్ల

5 | కరీంనగర్, బుధవారం 17 జనవరి 2024 | RAJANNA SIRCILLA

రైతన్న జీవితానికి నిలువెత్తు చిహ్నం

- కరీంనగర్ ఏఎంసీలో ప్రత్యేక ఆకర్షణగా ఎడ్లబండి విగ్రహం

అందరికీ అన్నం పెట్టే అన్నదాత కుటుంబాన్ని గౌరవించుకునేలా, పాడి, వ్యవసాయ పశువులతో అతనికి ఉన్న అనుబంధాన్ని తెలియజేసేలా కరీంనగర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఎడ్లబండితో కూడిన రైతు విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కేసీఆర్ ప్రభుత్వంలో ఏర్పాటైన మార్కెట్ కమిటీ పాలకవర్గం అభివృద్ధితోపాటు ప్రత్యేకతను చాటేలా దృష్టి సారించింది. ఈ మేరకు రూ.13 లక్షలతో రైతు ఎడ్లబండి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. మార్కెట్ ప్రధాన గేటుకు ఎదురుగా ఉన్న ఈ విగ్రహం లోపలికి వచ్చే ప్రతి ఒక్కరినీ కట్టిపడేస్తుంది. **-ముకరంపుర, జనవరి 16**

ఇరకాటంలో 'బండి'

- సంజయ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం
- కేసు నమోదు చేయాలని సీపీ, ఏసీపీకి లిఖితపూర్వక ఫిర్యాదు
- ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు కేసీఆర్ చేస్తున్నారన్న విషయం ఎలా తెలిసిందో చెప్పాలని డిమాండ్
- కుట్రలో ఆయన భాగస్వామియేనా..? అంటూ ప్రశ్న
- ఇప్పటికే బండికి గట్టి కౌంటర్ ఇచ్చిన మంత్రి పొన్నం
- ఇరు పార్టీల్లో దుమారం

సహజంగానే ఎన్నికల ముందు నిరాధార ఆరోపణలు చేయడం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కి అలవాటేనన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్ఎస్‌ను బద్నాం చేయడంతోపాటు కాంగ్రెస్‌లో అలజడి రేపే ఉద్దేశంతో ఆయన మూడు రోజుల క్రితం కరీంనగర్ వేదికగా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. 'కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కేసీఆర్ పెద్ద ఎత్తున కుట్ర చేస్తున్నరు. ఆ పార్టీలో ఆయన కోవర్టులున్నరు. ఎమ్మెల్యేలను కొనేందుకు స్కెచ్ వేస్తున్నరు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు కూడా కేసీఆర్‌తో టచ్‌లో ఉన్నరు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు. ఆ బద్నాంను మా పార్టీపైకి నెట్టివేసినా ఆశ్చర్యం లేదు' అంటూ చేసిన ఆరోపణలు ప్రస్తుతం ఆయనను ఇరకాటంలో పడేశాయి. ఒక రకంగా చెప్పాలంటే సెల్ఫ్‌గోల్ చేసుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతుండగా, దీనిపై కాంగ్రెస్ నేతలు ఏకంగా సీపీ, ఏసీపీకి ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమవుతున్నది.

కరీంనగర్, జనవరి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బండి సంజయ్ మళ్లీ పాతబాటే పట్టారు. ఇటు బీఆర్ఎస్, అలాగే కాంగ్రెస్‌పై విమర్శలకు దిగుతున్నారు. ప్రభుత్వాన్ని కూల్చివేసే కుట్రలు జరుగుతున్నాయంటూ ఈ నెల 14న సంజయ్ మాట్లాడిన మాటలు దుమారం రేపగా, ఆయన మాట్లాడిన రోజే రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ముట్టుకునే ధైర్యం ఎవరికీ లేదంటూ మండిపడ్డారు. అన్ని రంగాల్లో విఫలమైన ఎంపీల్లో సంజయ్ ముందుంటారంటూ తీవ్రస్థాయిలో విమర్శలు చేయడమే కాదు, ప్రభుత్వం కూలిపోతుందంటూ జ్యోతిష్కుడిలా మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ నాయకులు కూడా మరింత సీరియస్‌గా తీసుకున్నారు. బండి మాటలపై కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంగళవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి, ఏసీపీ నరేందర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు జరుగుతున్నాయనే విషయం సంజయ్‌కు ఏవిధంగా తెలిసిందో తెలుసుకోవాలని, అలాగే ఒక వేళ కుట్రలు చేసి ఉంటే ఆ విషయాన్ని పోలీసులకు ఎందుకు తెలుపలేదో చెప్పాలని, ఈ కుట్రల్లో బండి భాగస్వామ్యం ఎంత ఉందన్న అంశాలపై విచారణ జరిపి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని ఆ ఫిర్యాదులో డిమాండ్ చేశారు.

సంజయ్ సెల్ఫ్‌గోల్?

బండి మాటలకు మంత్రి పొన్నం స్ట్రాంగ్ కౌంటర్ ఇవ్వడం.. తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేయడం చూస్తే కాంగ్రెస్ పార్టీ ఈ విషయాన్ని అంత ఈజీగా వదిలేలా లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న లక్ష్యంతో ఇటు బీఆర్ఎస్‌ను బద్నాం చేసి.. అటు కాంగ్రెస్‌లో అలజడి రేపు దామని చూసిన బండి ప్లాన్ తిరగబడడమే కాదు, సెల్ఫ్ గోల్ చేసుకున్నారన్న చర్చ ప్రస్తుతం ఆయన సొంత పార్టీ బీజేపీలోనే నడుస్తున్నది. ఈ పరిస్థితుల్లో చేసిన ఆరోపణలను నిరూపించుకోవాల్సిన అవసరం బండిపై ఉన్నది.

సాక్ష్యాలు చూపుతారా..? మాట మారుస్తారా?

బండి మాటల వ్యవహారంలో ఆరోపణలు, ప్రత్యారోపణల వరకు విషయం ఉంటే అంత ప్రాధాన్యత ఉండేది కాదు. కానీ, కాంగ్రెస్ ఏకంగా ఏసీపీకి ఫిర్యాదు చేయడంతో ఇది చర్చనీయాంశమవుతున్నది. ఆ ఫిర్యాదు వెనుక కాంగ్రెస్ పెద్దల హస్తం కూడా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో బండి తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉంటారా..? ఫిర్యాదులో అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇస్తారా..? ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు జరుగుతున్నాయని చెప్పినట్టుగా సాక్ష్యాలను చూపుతారా..? లేక ఎప్పటి మాదిరిగానే కొట్టి పారేస్తారా..? మాట మారుస్తారా..? అన్నది ముమ్ముందు తేలనున్నది. ఇదే సమయంలో కాంగ్రెస్ సైతం ఈ వ్యవహారంపై ముందుకు వెళ్తుందా లేదా..? అన్నది తేలాల్సి ఉన్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నందున ఫిర్యాదుపై విచారణ జరిపేలా చేస్తారా..? లేక ఫిర్యాదుకే పరిమితమై ఊకుంటారా..? ఈ ఫిర్యాదు ప్రచారం కోసం చేసిన స్టంటా..? లేక నిజంగానే బండిని విచారణ చేసేంత వరకు వెంట పడుతారా..? అన్నది ముమ్ముందు తేలనున్నది. మొత్తంగా చూస్తే విమర్శలు, ప్రతివిమర్శలు, పోలీసులకు ఫిర్యాదుల నేపథ్యంలో ఎవరు తలొగ్గుతారో వేచి చూడాల్సి ఉన్నది. ప్రస్తుతం ఈ వ్యవహారం ఆ రెండు పార్టీల్లోనూ దుమారం రేపుతున్నది.

ఫిర్యాదు కాపీని చూపుతున్న కాంగ్రెస్ పార్టీ నగర కమిటీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు

కుట్ర ఎవరిదో చెప్పాలి

- సంజయ్‌పై ఏసీపీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు

రాంనగర్, డిసెంబర్ 16: కాంగ్రెస్ సర్కార్‌ను కేసీఆర్ కూల్చే కుట్ర చేస్తున్నారంటూ ఎంపీ సంజయ్ చేసిన వ్యాఖ్యలపై ఆధారాలు బహిర్గతం చేయాలని కాంగ్రెస్ నగర కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలు ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలు దెబ్బతిసేలా ఉన్నాయని మండిపడ్డారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మంగళవారం టౌన్ ఏసీపీ నరేందర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కుట్ర జరిగిందన్న విషయం ఆయనకు ఎలా తెలిసిందో చెప్పాలని, ఆ వివరాలు బహిర్గతం చేయకపోవడం కూడా నేరమే అవుతుందన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు వైద్యుల అంజన్ కుమార్, కొరివి అరుణ్ కుమార్, తాజుద్దీన్, శ్రవణ్, చర్ల పద్మ, అబ్దుల్ రెహమాన్, తదితరులున్నారు.

పూర్తి స్థాయి విచారణ చేయాలి: సీపీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు

ఎంపీ సంజయ్ చేసిన వ్యాఖ్యల వెనుక దాగి ఉన్న కుట్రను చేధించాలని కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సంజయ్ వ్యాఖ్యల వెనుక ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర ఉందన్న అనుమానాలు ఉన్నాయని, పూర్తి స్థాయి విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ దవాఖానలో విభేదాలు

- వర్గాలుగా వైద్యులు, సిబ్బంది పరస్పరం ఫిర్యాదులు
- చర్యలు తీసుకున్నా మారని తీరు
- కలెక్టర్ చర్యలపైనా చర్చ

రోగులకు సేవలందించాల్సిన కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖానలోని పలువురు వైద్యులు, సిబ్బంది వర్గాలుగా విడిపోయి.. పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే జడ్పీ చైర్‌పర్సన్ విజయ చేసిన ఫిర్యాదులోనూ ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. పలువురు వైద్యులు, సిబ్బందిపై కలెక్టర్ పమేలా సత్పతి చర్యలు తీసుకోగా, ఆమె చర్యలపైనా జోరుగా చర్చ సాగుతున్నది. అంతే కాదు, తమపై చర్యలు తీసుకోవడానికి కలెక్టర్‌కు అధికారం లేదంటూ కొంత మంది వైద్యులు వాదనలు తెరపైకి తేవడం హాట్ టాపిక్‌గా మారింది.

విద్యానగర్, జనవరి 16: జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ గత నెల 12న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దవాఖాన అభివృద్ధి కమిటీ (హెచ్‌డీసీ) చైర్ పర్సన్‌గా ఉన్న ఆమె పలు విషయాలపై విచారణ జరపాలని కోరారు. 2022 జనవరి నుంచి హెచ్‌డీసీ సమావేశం నిర్వహించడం లేదని, హెచ్‌డీసీ నుంచి ఆమోదం పొందాల్సిన ఫైల్స్ తనకు రావడం లేదని, దవాఖానకు ప్రభుత్వం నుంచి వస్తున్న, హెచ్‌డీసీ నుంచి కొనుగోలు చేస్తున్న మందుల వివరాలు తనకు తెలుపడం లేదని, ప్రజాప్రతినిధులు ఫోన్ చేస్తే అధికారులు స్పందించడం లేదని, తదితర విషయాలపై విచారణ చేపట్టాలని ఆమె కోరారు. ఈ మేరకు కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా వైద్యాధికారి లలితాదేవిని విచారణ అధికారిగా నియమించి విచారణ చేయించారు.

లోతుగా విచారణ!

జడ్పీ చైర్‌పర్సన్ ఫిర్యాదుతోపాటు ఉన్నతాధికారులకు అందిన మరిన్ని ఫిర్యాదులపై విచారణాధికారి విచారణ చేసినట్టు తెలుస్తున్నది. దీంతో పలువురు వైద్యులు, సిబ్బంది పరస్పర ఆరోపణలు చేసుకున్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో మరింత లోతుగా విచారణ జరిపినట్టు సమాచారం. దీంతో సంబంధిత సిబ్బంది అక్రమాలు బహిర్గతం కాగా, పూర్తి స్థాయి నివేదికను కలెక్టర్‌కు విచారణాధికారి సమర్పించినట్లు తెలుస్తున్నది.

కలెక్టర్ చర్యలపై చర్చ

పరస్పర ఆరోపణలు చేసుకుంటున్న దవాఖాన వర్గాలు.. కలెక్టర్ చర్యలపై కూడా రకరకాలుగా చర్చిస్తున్నారు. అసలు కలెక్టర్‌కు చర్యలు తీసుసుకునే అధికారమే లేదని, నిబంధనల ప్రకారం ఆ అధికారం సంబంధిత కమిషనర్‌కు మాత్రమే ఉంటుందని ఓ వర్గం తమ వాదనను తెరపైకి తెచ్చినట్టు తెలుస్తున్నది. తమకు ఏమి కాదన్న ధీమా వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇదే సమయంలో కృష్ణప్రసాద్‌పై కమిషనర్ చర్యలు తీసుకుంటే.. అదే స్థాయి హోదా ఉన్న మరో వైద్యారిలపై మాత్రం ఇక్కడే ఎలా చర్యలు తీసుకుంటారని చర్చిస్తున్నట్లు తెలుస్తున్నది. దీంతో ఇప్పుడు కలెక్టర్ తీసుకున్న చర్యలు సైతం దవాఖాన వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ముమ్ముందు ఇంకా ఎటువంటి పరిణామాలు తలెత్తుతాయో తేల నుండగా, రోగులకు సేవలందించాల్సిన దవాఖాన వైద్యులు, సిబ్బంది వర్గాలుగా విడిపోయి.. దవాఖానను రచ్చకెక్కించడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వ్యవస్థను చక్కదిద్దేందుకు ఉన్నతాధికారులు రంగంలోకి దిగాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులపై చర్యలు

నివేదిక ఆధారంగా కలెక్టర్ ఇప్పటికే పలువురు సిబ్బందిపై వేటు వేశారు. ఆ మేరకు కొంత మందిని డిప్యూటేషన్‌పై పంపగా, మరికొంత మందికి షోకాజ్ నోటీసులు, ఇంకొందరికి మెమోలు ఇచ్చారు. డీసీహెచ్ఎస్ కృష్ణప్రసాద్‌పై చర్యల కోసం వైద్య విధాన పరిషత్ కమిషనరేట్‌కు నివేదించారు. ఆ మేరకు డీసీహెచ్ఎస్‌గా కరీంనగర్‌లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఆయనకు తిరిగి పెద్దపల్లిలో పోస్టింగ్ ఇస్తూ కమిషనరేట్ నుంచి ఆదేశాలు ఇచ్చారు. మిగతా వారిలో ఆర్ఎంవో జ్యోతికి మెమో ఇస్తూ జమ్మికుంటకు వర్క్ ఆర్డర్ ఇచ్చారు. పిల్లల వైద్యుడు అజయ్‌కుమార్, ఫిజిషీయన్‌గా పనిచేస్తున్న డాక్టర్ కనుకం శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఏవో ఆఫీస్ సూపరింటెండెంట్, సంబంధిత క్లర్క్‌లకు మెమోలు ఇచ్చారు. విధి నిర్వహణ, రికార్డుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించినందుకు సంబంధిత వైద్యులు, సిబ్బందిపై ఈ తరహా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తున్నది. ఈ సమాచారాన్ని పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్‌తో పాటు వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు కలెక్టర్ పంపినట్లు సమాచారం.

అవిశ్వాసపు కుట్రలను తిప్పికొట్టాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, పక్కన జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, నాయకులు

- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలి
- కాంగ్రెస్ ప్రలోభాలకు లోనుకావద్దు
- బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

పెద్దపల్లి, జనవరి 16(నమస్తే తెలంగాణ): 'గత ఎన్నికల్లో అసత్యాలను ప్రచారం చేసి, ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచిన్రు. ఇప్పుడు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పదవుల నుంచి దించి గద్దెనెక్కేందుకు ఆ పార్టీ నాయకులు ఎత్తులు వేస్తున్నరు. ఏవో ఆశలు చూపి, ప్రలోభ పెడుతున్నరు' అని బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండి కాంగ్రెస్ నాయకుల కుట్రలను తిప్పికొట్టాలని, బలమైన నాయకులుగా మన సత్తా ఏంటో చాటాలని పిలుపునిచ్చారు. పెద్దపల్లిలోని రాఘవాపూర్ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థులు ఆచరణకు సాధ్యం కాని హామీలు, అనేక రకాల మోసపూరిత వాగ్దానాలతో ఎమ్మెల్యేలుగా గెలిచారని విమర్శించారు. అయినా తాము ప్రజాతీర్పును తాము శిరసా వహిస్తున్నామని చెప్పారు. అయితే ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు మరో కుట్రకు తెరలేపారని, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులను పదవుల నుంచి దించేందుకు ప్రలోభాలకు గురిచేస్తున్నారని విమర్శించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్, జిల్లా పరిషత్‌లో అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టి పడగొట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు జిల్లాలో పరిస్థితులను మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వివరించామని, ఆయన ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులకు తామంతా భరోసా ఇస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ అని, ఉద్యమ నాయకులే నేడు ప్రజాప్రతిధులుగా ఉన్నారని, అలాంటి బీఆర్ఎస్ నాయకులను దింపే కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలన్నారు. ప్రజాస్వామ్యంలో పదవుల నుంచి దింపే అప్రజాస్వామిక కుట్రలు సరి కాదని హితవు పలికారు. పార్టీ బీఫాంలపై గెలిచిన వారందరికీ ఏప్ జారీ చేస్తామని, ఎవరైనా ధిక్కరిస్తే వారం లోపే వారి పదవి పోతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, ఆర్బీఎస్ జిల్లా అధ్యక్షుడు పాల రామారావు, జడ్పీటీసీలు గంట రాములు, ఆముల నారాయణ, తగరం సుమలత శంకర్‌లాల్, పుస్కూరి పద్మజ జితేందర్‌రావు, బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ ఉన్నారు.

జీపీ కార్యదర్శులకు నోటీసులు

- ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీలో మొదలైన లొల్లి
- పరస్పరం దాడి.. ఫిర్యాదు
- అధికారుల సీరియస్.. నేడు ఇద్దరికీ నోటీసులు
- జాప్యం చేసిన ఎంపీవోకు కూడా..

వేములవాడ/బోయినపల్లి , జనవరి 16: బోయినపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు కొట్టుకోవడాన్ని జిల్లా అధికారులు తీవ్రంగా పరిగణించారు. వీరికి నోటీసులు జారీ చేయనున్నారు. మండలంలోని మర్లపేట గ్రామపంచాయతీ రాయినేని లక్ష్మణ్ సెలవుపై వెళ్లగా, నర్సింగాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి జనగామ శేఖర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. తర్వాత లక్ష్మణ్ రావడంతో ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే బాధ్యతలు అప్పగించారు. అందులో ఓ కట్ట కనిపించడం లేదని సంబంధిత మండల అధికారి సెల్‌ఫోన్ నుంచి సెక్రటరీ శేఖర్‌కు ఫోన్ చేశారు. ఇక్కడే ఇరువురి మధ్య గొడవ జరిగింది. కొట్టుకునే స్థాయికి వెళ్లింది. అంతటితో ఆగకుండా వీరిద్దరు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు కూడా చేసుకున్నారు. అయితే కార్యాలయంలో దరఖాస్తుల డాటా ఎంట్రీ సమయంలో కార్యదర్శులు కొట్టుకోవడాన్ని జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ సీరియస్‌గా తీసుకున్నారు. ఆ ఇద్దరు కార్యదర్శులకు బుధవారం నోటీసులు జారీ చేస్తామని మంగళవారం వెల్లడించారు. కార్యదర్శుల గొడవ జరిగిన తీరును ఉన్నతాధికారులు నివేదించడంలో జాప్యం చేసిన ఎంపీవో గంగ తిలక్‌కు కూడా నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. ఇక కట్ట దొరికిందని అధికారులు చెబుతున్నప్పటికీ అది నిజంగానే పోయిందా..? ఉందా..? అనేది మాత్రం ఉన్నతాధికారుల విచారణలో తేలే అవకాశమున్నది.



అందుకున్న పురస్కారాలను చూపుతున్న తంగళ్లపల్లి మండల సర్పంచులతో ఎమ్మెల్యే కేటీఆర్

చందుర్తి: కేసీఆర్ ఆరోగ్యం ఎలా ఉందంటూ కేటీఆర్‌ను అడుగుతున్న ఈర్లపల్లి నారాయణ

గ్రామ స్వరాజ్యాన్ని సాధించాం

- గాంధీజీ కలలు సాకారం చేశాం
- పదేండ్లలోనే 81 జాతీయ అవార్డులు సాధించాం
- సర్పంచులందరికీ నా కృతజ్ఞతలు
- రాజకీయమైనా, జీవితమైనా ఎదురుదెబ్బలు సహజం
- గోడకు తగిలిన రబ్బరు బంతిలా తప్పకుండా తిరిగి వస్తాం
- ఎమ్మెల్యే కేటీఆర్
- సిరిసిల్లలో విస్తృత పర్యటన

తంగళ్లపల్లి మండలం జిల్లెళ్లలో కేటీఆర్ డైనమిక్ టోర్నీ విజేతలకు కప్ అందిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ మంత్రి వినోద్

రాజన్న సిరిసిల్ల, జనవరి 16 (నమస్తే తెలంగాణ)/ముస్తాబాద్/ చందుర్తి: 'ఒకప్పుడు పల్లెలంటే పాడుబడ్డ బావులు, పాత గోడలు, చెత్త కుప్పలు, మట్టి దిబ్బలు. తెలంగాణ వచ్చినంక పల్లె ముఖచిత్రమే మారిపోయింది. దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు అన్న మహాత్మాగాంధీ మాటలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాం. గ్రామ స్వరాజ్యాన్ని సాధించి ఆయన కలలు సాకారం చేసిన రాష్ట్రం మనదేనని చెప్పుకోవడం గర్వంగా ఉందని' బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. నాడు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడిన పల్లెలను నేడు సకల సౌకర్యాల హరివిల్లులుగా మార్చిన ఘనత మనదేనని, పల్లె కన్నీరు పెడుతుందన్న పాట ఓ ప్రభుత్వాన్నే కూల్చేసిందని గుర్తు చేశారు. సమష్టి కృషితో సిరిసిల్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుంచిన సర్పంచులందరికీ శిరస్సు వంచి సలాం చేస్తున్నానన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చెప్పిన ప్రతి పనిని సమర్థవంతంగా చేసి పల్లెకు గుర్తింపు తెచ్చినందుకు గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు ఓడీఎఫ్ ప్లస్ కలిగిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపిన సర్పంచులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. మంగళవారం సిరిసిల్ల జిల్లాలో మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. ఉదయం 11.30గంటల నుంచి రాత్రి 10గంటల వరకు పర్యటించిన ఆయన, మొదట రగుడు వద్ద తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్పంచుల ఆత్మీయ సత్కార కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం చందుర్తి మండలం మల్యాలకు చేరుకొని, కేసీఆర్ కప్ వాలీబాల్ టోర్నీని ప్రారంభించారు. తిరిగి సిరిసిల్లకు వచ్చి, పలువురిని పరామర్శించడంతోపాటు నూతన జంటలను ఆశీర్వదించారు. ఆ తర్వాత తంగళ్లపల్లిలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని దర్శించుకొని, పూ జలు చేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల కేటీఆర్ మాట్లాడా రు. పదవి నుంచి దిగిపోయే ముందు కూడా గౌరవంగా పం పించాలన్న ఉద్దేశంతో ఈ ఆత్మీయ సత్కారం ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదవిలో ఉన్నప్పుడు అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా మంచి పనులు చేశారని కొనియాడారు. కేసీఆర్ ప్రభుత్వం లేదన్న విషయం ఇంకా ప్రజలకు పూర్తి స్థాయిలో తెలియదని, తెలిసి జీర్ణించులేక పోతున్నారని పేర్కొన్నారు. జీవితమైనా, రాజకీయమైనా ఎదురు దెబ్బలు సహజమన్నారు. రాజకీయాల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించే సత్తా ఉండాలని, గోడకు తగిలిన రబ్బరు బంతిలా తప్పకుండా తిరిగి వస్తామని చెప్పారు.

జాతీయ స్థాయి అవార్డుల్లో మనమే టాప్

కేసీఆర్ సర్కారు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణకు 81 అవార్డులు వచ్చాయని మంత్రి తెలిపారు. అందులో 3శాతం కన్నా తక్కువ జనాభా ఉన్న తెలంగాణకు జాతీయ స్థాయిలో 35శాతం అవార్డులు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన పథకం కింద టాప్‌టెన్‌లో పదికి పది అవార్డులు, ఇరవైలో 19 అవార్డులు తెలంగాణకే దక్కాయంటే సర్పంచుల పని తీరుకు నిదర్శమని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్‌లో 20, మిషన్ భగీరథకు వందకుపైగా అవార్డులు అందుకున్నది దేశంలో ఏకైక రాష్ట్రం తెలంగాణనేనని చెప్పారు. పంచాయతీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై మీ తరపున గొంతు విప్పడానికి తాను సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు. దేశంలో చెక్ పవర్ ఉన్నది కేవలం సర్పంచులు, రాష్ట్రపతికి మాత్రమేనన్నారు. ఇది వీడ్కోలు సభ కాదని, మళ్లీ ఎన్నికల్లో గెలిచి వస్తారని ఆకాంక్షించారు. తెలంగాణ రాకముందు రాష్ట్రంలో పల్లె ప్రకృతి వనాలు, డంప్ యార్డులు, వైకుంఠధామాలు, పల్లె బృహత్ వనాలు, మంకీపుడ్‌కోర్టులు లేవన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇవన్నీ ఏర్పాటు చేసుకున్నామని, ఎవరు చనిపోయినా సంస్కారవంతంగా అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నామన్నారు.

సర్పంచులు అదృష్ట వంతులు: మాజీ ఎంపీ వినోద్

కేసీఆర్ నాయకత్వంలోని మంచి ప్రభుత్వంలో పనిచేసిన సర్పంచులు అదృష్ట వంతులని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. పదవులు శాశ్వతం కాదని, మనం చేసిన పనులతో మన పేరు సమాజంలోని ప్రతి ఒక్కరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతుందని చెప్పారు. పదవీకాలం ముగుస్తున్న సర్పంచులను సన్మానించాలన్న ఆలోచన స్థానిక బీఆర్ఎస్‌కు రావడం గొప్ప విషయమన్నారు. సమాజంలో గర్వించ దగ్గ పదవులంటే సర్పంచ్ మాత్రమేనని చెప్పారు. మన పిల్లల భవిష్యత్తు మంచిగుండాలన్న ఉద్దేశంతోనే తెలంగాణ తెచ్చుకున్నామని చెప్పారు. యువత చెడు అలవాట్ల వైపు వెళ్లొద్దని, క్రీడల్లో రాణించాలని కోరారు. ఒలింపిక్స్‌లో ఆడేస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక వ్యాయామంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు తోడ్పడతాయన్న